క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ రాజేందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. నిధులు ఉన్నంతమేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఐదవ వార్డు కౌన్సిలర్ సురేశ్ ఇటీవల జిల్లా టెలికాం సలహా బోర్డు సభ్యుడిగా నియమితులైనందున ఆయన్ను మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ అశోక్‌గౌడ్ పలువురు కౌన్సిలర్లు సన్మానించారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా నియమితులైన సుహాసినిరెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిలతో పాటు పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మండల శాఖల అధ్యక్షులు మల్లేశ్, శ్రీనివాస్ రావు, మహేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సురేష్‌నాయక్, చిన్న అంజిగౌడ్, ఉదయ్, అజ్మత్, హరీశ్, రసస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 40 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం పార్టీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసం, బతుకమ్మ సంబరాల్లో ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సేవలందిస్తున్నారని వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఇన్‌చార్జి సీడీపీఓ సరళకుమారి తదితరులు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు.

కోనాపూర్‌లో కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సంతోష్‌రావు

కొల్చారం(నర్సాపూర్): దసరా పర్వదినం సందర్భంగా మండలంలోని కోనాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ పోటీలు బీఆర్‌ఎస్ మండల యువత అధ్యక్షుడు సంతోష్‌రావు సౌజన్యంతో చేపట్టారు. ఈ పోటీల్లో మొత్తం ఆరు టీంలు పోటీ పడుతున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలు గురువారం ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంతోష్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు వెంకటేశం గుప్తా, రమేశ్, రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, మధుసూదన్ రెడ్డి,రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అవకాశమివ్వండి

పాపన్నపేట(మెదక్): నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పాపన్నపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. త్వరలో నామినేట్ చేయనున్న పదవులకు ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. ఏడుపాయల పాలక వర్గ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకు ఇవ్వాలని కోరారు.



పాపన్నపేట(మెదక్): లక్ష పుష్పార్చనతో దుర్గమ్మ



నర్సాపూర్‌లోని ధర్మశాలలో లక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత



పాపన్నపేట(మెదక్): కుంకుమార్చనలో మహిళలు

మహాలక్ష్మి నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళవారం వేడుకల్లో భాగంగా ఆరో రోజు ఆలయాల్లో అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాల వద్ద లోక కల్యాణార్థం భవానీ మాలలు ధరించిన భక్తులు వేద పండితులతో మహా చండీహోమం నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ దేవీ నామస్మరణతో మారుమోగాయి.



నర్సాపూర్: బగలాముఖీ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో అమ్మవారికి పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): భుజిరంపేటలో దుర్గాదేవి



వెల్దుర్తి(తూప్రాన్): హోమం నిర్వహిస్తున్న భవానీ భక్తులు



చేగుంట(తూప్రాన్): హనుమాన్ దేవాలయంలో కుంకుమార్చన



అల్లాదుర్గం: రెడ్డిపల్లిలో దుర్గామాతను దర్శించుకుంటున్న చిన్నారులు



టేక్మాల్(మెదక్): పల్వంచలో అమ్మవారి వద్ద కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



పెద్దశంకరంపేటలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నర్సాపూర్ రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు చోటు



హరిరంజన్‌శర్మ



బాగారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన మాసాయిపేట మండలానికి చెందిన ఉపాధ్యాయులు హరిరంజన్ శర్మ, బాగారెడ్డిని ఆ సంఘం నాయకులు అభినందించారు. విద్యారంగ సమస్యలతో పాటు సంఘం బలోపేతానికి కృషిచేయాలని మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి దయాకర్, మండల కార్యవర్గ సభ్యులు ఆకాంక్షించారు.

కేంద్రం నిధులతో గ్రామాభివృద్ధి



పార్టీ సభ్యత్వ నమోదులో మల్లేశంగౌడ్

కొల్చారం(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చే నిధులతో గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి వాల్దాస్ మల్లేశంగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేట గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సభ్యత్వ నమోదు 63, 64, 65 బూత్‌ల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతులకు సకాలంలో పెట్టుబడికి అవసరమైన ఆర్థికసాయం అందించిన ఘనత తమ పార్టీదని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు గిరి, పోచందర్, గంగరాజు, సాయితో పాటు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో బీజేపీ నాయకుల సంబురాలు

టేక్మాల్(మెదక్): హర్యానా రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం టేక్మాల్‌లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎల్లుపేట రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు నాగరాజు, భూత్ అధ్యక్షులు వెంకట్, రమేశ్ యాదవ్, సాయిరామ్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో ...

పెద్దశంకరంపేట(మెదక్): హర్యానా రాష్ట్రంలో మరోసారి బీజేపీ గెలుపొందడంపై బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, కృష్ణ తదితరులున్నారు.



టేక్మాల్‌లో టపాకాయలు కాలుస్తున్న బీజేపీ నాయకులు

లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

నర్సాపూర్: ఉమ్మడి మెదక్ స్థాయి దివ్యాంగుల వసతి గృహం భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అనేక ఏళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 13ఏళ్ల క్రితం రూ.ఒక కోటితో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి దివ్యాంగుల వసతి గృహం నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. అనంతరం కొంత కాలానికి రాష్ట్రం విడిపోవడంతో వసతి గృహం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వసతి గృహంలో వంద మంది దివ్యాంగులు ఉండేలా ప్రణాళిక రూపొందించడంతో భవనం చాలా పెద్దగా నిర్మించతలపెట్టారు. భవనం పనులు స్లాబ్ వరకు చేపట్టారు. అనంతరం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో దివ్యాంగుల వసతి గృహానికి నిధులు విడుదల కేటాయించకపోవడంతో భవనం స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయింది. భవనం పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోనందున దివ్యాంగుల వసతి గృహ భవనం స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయింది.

భవనం పూర్తి చేస్తే ఉపయోగం

ప్రస్తుతం దివ్యాంగుల వసతి గృహం ఏర్పాటు చేయలేని పరిస్థితులుంటే నర్సాపూర్‌లో వసతి గృహం కోసం అసంపూర్తిగా వదిలేసిన భవనాన్ని ఇతర శాఖలకైనా కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు అంటున్నారు. నర్సాపూర్‌లో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక శిథిలావస్థ భవనాలు ఇతర శాఖలకు చెందిన ఇరుకు భవనాల్లో కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. ఈవిషయమై స్థానిక పీఆర్ డీఈఈ రాధికలక్ష్మిని వివరణ కోరగా.. ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచనల మేరకు భవనం పూర్తి చేసేందుకు అంచన వ్యయం ప్రతిపాదనలు తయారు చేసి అందజేశామని చెప్పారు. నిధులు వస్తే పనులు చేపడుతామని ఆమె చెప్పారు.



చాలా ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న దివ్యాంగుల వసతిగృహం భవనం

వీధి దీపాల ఏర్పాటు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి వెంట వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తితో కాంగ్రెస్ మండల నాయకుడు, గౌడ సంఘం అధ్యక్షుడు, అప్పాజీపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌గౌడ్ తన సొంత నిధులు రూ.30వేలు వెచ్చించి వీధి దీపాలను ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకట్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సింలు, పోచయ్య, రాజాగౌడ్, దుర్గేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



వీధి దీపాలు అందిస్తున్న వెంకట్‌గౌడ్



చేగుంటలో అట్ల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



నర్సాపూర్: బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న జిల్లా మహిళా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో..

అట్ల బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో వివిధ కూడళ్లు, ఆలయాల వద్ద అందంగా పూలతో పేర్చిన బతుకమ్మలు ఒక్కచోట పేర్చి మహిళలు బతుకమ్మ ఆటలాడుతూ పాటలు పాడారు. అనంతరం చెరువుల్లో వాటిని నిమజ్జనం చేశారు.



పెద్దశంకరంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కౌడిపల్లి(నర్సాపూర్): అట్ల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెద్దశంకరంపేట(మెదక్): తిరుమలాపూర్‌లో..



రేగోడ్(మెదక్): బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధ్యాయులుగా ఎంపికైన దంపతులు



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడు గ్రామానికి చెందిన అల్లాదుర్గం శేఖులు–స్వప్న దంపతులు మంగళవారం ప్రకటించిన డీఎస్సీ ప్రత్యేక కేటగిరి విభాగంలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మొదటి నుంచి వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలన్న వీరి లక్ష్యం నిజమవ్వడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఇరువురు కృతజ్ఞతలు తెలిపారు.

◆ మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పోచయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండగకు సెలవుల్లో ఇంటికి వచ్చిన తమ పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని తెలిపారు. ఇంకా ఎవరైన మద్యం సేవించి వాహనాలు నడిపితే తగిన చర్యలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని, మహిళలు బతుకమ్మ ఆడేటప్పుడు బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు.

◆ రైతులకు న్యాయం చేయండి

చేగుంట(తూప్రాన్): దళిత రైతులకు న్యాయం చేయాలని చేగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకుడు శివరాజ్ మాట్లాడుతూ.. చేగుంటకు చెందిన 11 మంది దళిత రైతుల సర్వేనంబర్ 402/2లో 13 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితం జీవిక పరిశ్రమ యాజమాన్యం తక్కువ డబ్బులకు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం భూముల ధరల ప్రకారం దళితులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ నర్సాపూర్‌లో షూటింగ్



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పరిసర ప్రాంతాల్లో యాదుల అనే ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. నర్సాపూర్ ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతంతో పాటు తెలంగాణ పల్లెలు ఉండడంతో ఇక్కడ షూటింగ్‌ను ఎంచుకున్నట్లు ప్రొడ్యూసర్, గాయకుడు, శ్రీశైలం తెలిపారు.

◆ కార్మికులకు బోనస్ ఇవ్వాలి

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పరిశ్రమల యజమాన్యం బోనస్‌లు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులతో పాటు ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులకు 1965 బోనస్ చట్టం ప్రకారం పరిశ్రమల లాభనష్టాలకు సంబంధం లేకుండా కార్మికులందరికీ బోనస్ చెల్లించాలన్నారు. కొన్ని పరిశ్రమలు చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులకు బోనస్‌లు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు బోనస్ ఇవ్వని పరిశ్రమలపై ప్రత్యక్ష నిరసన చేస్తామని హెచ్చరించారు.

◆ తండ్రిని కొట్టిన తనయులు

నర్సాపూర్: తండ్రిని కొట్టిన తనయుల ఉదంత మిది. శివ్వంపేట పోలీసుల కథనం ప్రకారం.. గుమ్మడిదల్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆగం శ్రీనివాస్ ఈనెల ఆరున సాయంత్రం ఆరు గంటల సమయంలో తన మేకలను గ్రామంలోని మేకల కొట్టంలో పెట్టి తన పొలం వద్దకు వెళ్లాడు. ఆయన పొలం నుంచి ఇంటికి వచ్చి కొట్టంలో చూడగా ఒక మేక కన్పించలేదు. దీంతో మరునాడు ఆగం శ్రీనివాస్ తన బావమరుదులతో కలిసి మేకను వెతికేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. శివ్వంపేట మండలంలోని చాకరిమెట్ల పరిసరాల్లో వెతుకుతుండగా.. ఎదురుపడిన కుమారులు తామె అమ్ముకున్నామంటూ తండ్రిని, మామలను కర్రలతో కొట్టారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ వికాస పిల్లలకు అండగా ఉంటా

జగదేవ్‌పూర్(గజ్వేల్): వికాస పిల్లలకు అండగా ఉంటూ 17యేళ్లుగా పండుగకు నూతన వస్త్రాలు అందిస్తున్నానని మాజీ జెడ్పీటీసీ రాంచంద్రంయాదవ్ తెలిపారు. మండలంలోని అలిరాజపేటలో మంగళవారం ఎస్‌సీవీ రోజ్ సంస్థలోని వికాస పిల్లలకు దుస్తులు, వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.